
సాక్షి
కుమురం భీం

గురువారం, 5, జనవరి, 2023



వైర్‌లెస్ స్టేషన్లు.. వాకీటాకీలు

జన్నారం అటవీ డివిజన్‌లో వైర్‌లెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, వాకీటాకీలు అందుబాటులోకి తెచ్చారు. ఇక నుంచి సమాచార మార్పిడి వేగవంతం కానుంది. 8లో▸



చెస్ క్రీడాకారుడికి అభినందన

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపిన ఎంజేపీ పాఠశాల విద్యార్థి కార్తీక్‌ను బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ అభినందించారు. మొదటిస్థానంలో నిలవడం జిల్లాకే గర్వకారణమన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.2 / 17.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత కాస్త తగ్గుతుంది. ఉదయం ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం



బాధితురాలికి కిట్ అందిస్తున్న అధికారులు

కౌటాల(సిర్పూర్): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో బుధవారం బోదకాలు వ్యాధిగ్రస్తులకు ఎంఎండీపీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలేరియా వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. బాధితుడి శరీర భాగాలకు ఇన్‌ఫెక్షన్ సోకి అంగవైకల్యం రాకుండా ఈ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 24 మందికి కిట్లు అందజేశామన్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పల్లవి, సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, సిబ్బంది రషీద్, అశోక్, పావని తదితరులు ఉన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న విస్తృత స్థాయి కార్యకర్తల సమ్మేళనంలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, బూత్ స్థాయి కార్యకర్తలు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు పాల్వాయి హరీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎంలతో బోధన సులభతరం

వాంకిడి(ఆసిఫాబాద్): టీఎల్ఎం(టీచర్ లర్నింగ్ మెటీరియల్)తో బోధన సులభతరం అవుతుందని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని ఇందాని ఉన్నత పాఠశాలలో మండలస్థాయి బోధనోపకరణాల మేళాను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని 56 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల టీఎల్ఎంలను ప్రదర్శించారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో మనుకుమార్, మండల నోడల్ అధికారి రాథోడ్ సుభాష్, అసిస్టెంట్ కమిషన్ ఆఫ్ జనరల్ ఉదయ్‌బాబు, జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, హెచ్ఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు సాధించారు



కేంద్రంలో నిల్వచేసిన పట్టుగూళ్లు

అడవులను నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులకు దసలి పట్టు మంచి ఆదాయాన్ని సమకూరుస్తోంది. భూములు లేని నిరుపేదలు అడవుల్లో తమకు కేటాయించిన చెట్లపై పట్టుపురుగులు పెంచుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కౌటాల మండలం తలోడి పట్టుపురుగుల కేంద్రం లాభాల బాటలో పయనిస్తోంది.

- తలోడి పట్టు పురుగుల కేంద్రంతో గిరిజనులకు ఉపాధి
- మూడేళ్ల తర్వాత అనుమతులు మంజూరు చేసిన అటవీశాఖ
- ఈ నెల 25న పట్టుగూళ్లకు వేలం
- ఇతర రాష్ట్రాల్లో దసలి పట్టుకు డిమాండ్

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం తలోడి గ్రామంలో 1983లో దసలి పట్టుపురుగుల కేంద్రం ఏర్పాటు చేశారు. ఒకట్రెండు గ్రామాల రైతులతో ప్రారంభమైన ఈ పరిశ్రమ ఇప్పుడు మూడు మండలాల గిరిజనులకు జీవనాధారంగా మారింది. దినదినాభివృద్ధి చెందుతూ కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో మారుమూల గ్రామాల గిరిజనులకు జీవనోపాధి కల్పిస్తోంది. ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పట్టుగుడ్లు పంపిణీ చేస్తోంది. వీటితోపాటు 4 ప్లాస్టిక్ డబ్బాలు, 2 కత్తెరలు, ఒక టార్పాలిన్, 4 ట్రేలు, ఒకటి నైలన్ నెట్, బ్లీచింగ్ పౌడర్, సున్నం అందిస్తోంది.

తక్కువ శ్రమ..

దసలి పట్టు సాగులో రైతులకు కూడా తక్కువ శ్రమ ఉంటుంది. మొదట దసలి గుడ్లను సమీప అడవుల్లోని మద్దిచెట్టు ఆకులపై వేస్తారు. ఆ గుడ్ల నుంచి వచ్చిన పురుగులు నిద్రావస్థకు చేరుకుని తన చుట్టూ దారంలా గూడు అల్లుకుంటుంది. ఆ గూడే దసలి పట్టు కాయ. ఇలా కాయగా మారడానికి 40 రోజుల సమయం పడుతుంది. ఈ సమయంలో చెట్టు నుంచి గూళ్లు కిందకు జారిపడకుండా చూసుకుంటే సరిపోతుంది. తలోడి దసలిపట్టు పరిశ్రమలో ఈసారి 4 లక్షల పట్టుగూళ్ల దిగుబడి వచ్చింది.

గిరిజన కుటుంబాలకు ఉపాధి



తలోడిలోని దసలి పట్టుపురుగుల కేంద్రం

తలోడి దసలి పట్టుకేంద్రం కుమురంభీం జిల్లాకే తలమానికంగా నిలుస్తోంది. కౌటాల మండలం తలోడి, చింతలమానెపల్లి మండలంలోని కోర్సిని, అంబగట్టు, గంగాపూర్, కర్జెల్లి, బెజ్జూర్ మండలంలోని ముంజంపెల్లి, కాటెపల్లి గ్రామాల నుంచి గిరిజన కుటుంబాలు పట్టుపురుగుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ మూడు మండలాల పరిధిలో సుమారు 300 మంది రైతులు పట్టు పురుగులు పెంచుతున్నారు.

మూడేళ్ల తర్వాత పెంపకం..

భూమిలేని నిరుపేద గిరిజనులు ఆయా గ్రామాల సమీపంలోని అడవుల్లో పట్టు పురుగుల పెంచుకునేందుకు అటవీశాఖ గతంలో కొంత స్థలం కేటాయించింది. ఏటా మొదటి పంటగా గూడ్లను ఉత్పత్తి చేసి వాటితో రెండు, మూడో పంటగా పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తున్నట్లు రైతులు తెలిపారు. మొదటి పంటకు నెల, రెండోపంటకు 45 రోజులు, మూడోపంటకు 90 రోజుల కాలం పడుతుంది. ఒక్కొక్క రైతు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు పట్టుగూళ్లను ఉత్పత్తి చేసి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం గడిస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా అటవీశాఖ పట్టు పురుగుల పెంపకానికి అవకాశం ఇవ్వలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ఏడాది మళ్లీ అనుమతులు మంజూరు చేశారు.

పొరుగు రాష్ట్రాల్లో గిరాకీ..

ఈ నెల 25న పట్టుగూళ్లకు వేలం వేయనున్నట్లు అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వేలంలో పాల్గొంటారు. ధరలు మాత్రం రైతులే నిర్ణయిస్తారు. వెయ్యి పట్టు కాయలకు ఈసారి రూ.4 వేల పైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

తక్కువ కాలంలో ఆదాయం



పట్టుపురుగుల పంట కాలం తక్కువగా ఉండటంతో తక్కువ సమయంలోనే ఆదాయం వస్తోంది. వ్యవసాయ భూమి లేకపోవడంతో ఈ సంవత్సరం 30 వేల పట్టుగూళ్లు పెంచా. సుమారు రూ.లక్ష వరకు ఆదాయం రానుంది. అధికారులు అవసరమైన పరికరాలు అందించాలి.

– ఎం.శంకరి, కాటేపల్లి, మం.బెజ్జూర్

15 ఏళ్లుగా సాగు



కాలం అనుకూలించక పంటలు పండని సమయంలో పట్టుగూళ్ల పంట కుటుంబానికి ఆదాయాన్ని ఇచ్చింది. 15 ఏళ్లుగా పట్టు గూళ్లు సాగుచేస్తున్నాను. ఈ ఏడాది దిగుబడి పెరిగింది. మూడేళ్లుగా పట్టు పెంపకానికి అటవీశాఖ అనుమతి ఇవ్వకపోవడం ఇబ్బంది పడ్డాం.

– ఎర్రటి చికటి, అంబగట్టు, మం.చింతలమానెపల్లి

రైతులకు ఎంతో లాభం



పట్టు పెంపకంతో రైతులకు ఎంతో లాభం ఉంటుంది. ఈ నెల 25న వేలం నిర్వహించనున్నం. వెయ్యి కాయలకు ప్రభుత్వం రూ.200 బోనస్ ఇస్తోంది. కాయకు రూ.4 వరకు ధర ఉంటుందని అంచనా వేస్తున్నాం. పంట విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తలోడి పట్టు పురుగుల కేంద్రంలో సంప్రదించాలి.

– సోము, టీఏ, తలోడి పట్టుపురుగుల కేంద్రం

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: ధరణి పోర్టల్‌లో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంతో కలిసి 'ధరణి' సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిస్సింగ్ సర్వే నంబర్లు, పేర్లు, విస్తీర్ణం సవరణ కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి రికార్డులను జాగ్రత్తగా పరిశీలించి నివేదికలు అందించాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదాస్పదమైన వాటిని పరిష్కరించాలని, కోర్టు కేసుల్లో ఉన్న వాటికి సంబంధించి పూర్తివివరాలు సమర్పించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు– మన బడి' పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో అశోక్, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాలు త్వరగా పూర్తిచేయాలి

జిల్లాలో నిర్మిస్తున్న క్రీడాప్రాంగణాలు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశంతో కలిసి క్రీడాప్రాంగణాల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీకి స్పోర్ట్స్ కిట్ కోసం ప్రభుత్వం రూ.25 వేలు కేటాయిస్తోందన్నారు. బృహత్ పల్లె ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన స్థలాలను గుర్తించి నివేదించాలన్నారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో రమేశ్, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావాలి



ఆసిఫాబాద్‌లో ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ప్రదర్శనలు తిలకిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: సైన్స్ ఎగ్జిబిషన్ల నిర్వహణతో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన డివిజన్‌స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి ప్రారంభించారు. వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి, వాటి వినియోగం కూడా అడిగి తెలుసుకున్నారు. ఏసీఎంవో ఉద్ధవ్ మాట్లాడుతూ డివిజన్ స్థాయి పోటీల్లో 84 ప్రాజెక్టులు ప్రదర్శించారని, ప్రతిభ చూపిన విద్యార్థులు ఈ నెల 10న ఉట్నూర్‌లో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రదర్శనలను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డెప్యూటీ డైరెక్టర్ మణెమ్మ పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మందికి ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, ఏటీడీవో క్షేత్రయ్య, జిల్లా క్రీడల అధికారి మధుసూదన్, ఎంపీపీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు ఇంటి ధ్యాస లేకుండా ఆశ్రమ పాఠశాలలో చదువుకోవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అడిషన్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదులతోపాటు నూతన భవనం నిర్మించే విషయాన్ని ఇప్పటికే అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. హెల్త్, న్యూట్రిషన్, రిసోర్స్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, ఫుడ్ సేఫ్టీ, గణితం తదితర అంశాలపై విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఎంఈవో భిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలంటే భయమెందుకు?

- సీఎం కేసీఆర్ కనీసం ఉద్యోగుల పదోన్నతుల ఫైల్ చూడరా?
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



కట్టెల మోపు మోస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ సమావేశాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు భయమెందుకని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాల్సి వస్తుందని భయపడి శీతాకాల అసెంబ్లీ సమావేశాలు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. సీఎంకు ఎన్నికలపై ఉన్నంత శ్రద్ధ రాష్ట్ర ఉద్యోగులపై లేదని, పదోన్నతుల ఫైల్ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రజలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. ఉపాధి లేక కట్టెలు అమ్మి బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం, దుర్గంధం, రకరకాల వ్యాధులతో స్థానికులు ఇబ్బందులు పడుతుంటే ఎస్పీఎంలో ఉద్యోగాలు మాత్రం స్థానికేతరులకు ఇస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరందాస్ బస్తీ, నౌగంబస్తీ, రాజీవ్ నగర్, పోచమ్మ బస్తీ, ఇందిరా మార్కెట్‌లో పర్యటించారు. పలువురు యువకులు పార్టీలో చేరారు. అంతకు ముందు ఉదయం పేపర్ మిల్లు క్రీడామైదానంలో వాకర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, నియోజకవర్గ అధ్యక్షుడు దుర్గం ప్రవీణ్, నాయకులు రాంప్రసాద్, నక్క మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

'టోల్'పై గరం గరం!

- పనులు పూర్తి కాకుండానే వసూళ్లు అంటూ ఆగ్రహం
- అందుబాటులోకి వచ్చిన రోడ్డుకే అంటున్న అధికారులు
- మందమర్రి టోల్‌ప్లాజా రోజువారీ లక్ష్యం రూ.6.8లక్షలు
- ఆర్టీసీ, ప్రైవేటు, గూడ్స్ వాహనాలపై అదనపు భారం



మందమర్రి టోల్‌ప్లాజా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్తగా నిర్మిస్తున్న మంచిర్యాల–చంద్రాపూర్ జాతీయ రహదారి–363పై మందమర్రి టోల్‌ప్లాజాలో వాహనదారుల నుంచి రుసుం వసూలు చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా రోడ్డు నిర్మాణం పూర్తి కాకుండానే అదనపు భారం పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. గత నెల 30 నుంచి టోల్‌గేట్ వద్ద ప్రయాణికుల వాహన రకాన్ని బట్టి రుసుం వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. వారం రోజులుగా అక్కడి సిబ్బందికి కౌంటర్లలో రుసుం చెల్లించాకే వచ్చిపోయే వాహనాలను అనుమతి ఇస్తున్నారు. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులపై టోల్ ప్రభావం పడింది. ఆ మేరకు అన్ని చార్జీలు పెరిగాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సైతం అక్కడి సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంలో ఉండగానే టోల్ వసూలు చేయడంపై జిల్లా న్యాయసేవాధికార సంస్థలో బెల్లంపల్లికి చెందిన అడ్వకేట్ రవికుమార్ ఫిర్యాదు చేశారు.

పెరిగిన ఆర్టీసీ చార్జీలు

ఈ టోల్‌గేట్ గుండా రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో సైతం ప్రయాణ చార్జీలు పెంచారు. వాస్తవానికి రూ.6చొప్పున టికెట్ ధరలు పెంచాల్సి ఉండగా, రౌండ్‌ఫిగర్ పేరుతో రూ.పదికి మార్చారు. అంటే టికెట్ ధర ఇంతకుముందు రూ.20ఉంటే తాజాగా రూ.30కి చేరింది. మంచిర్యాల, మందమర్రి, సోమగూడెం, బెల్లంపల్లి, తాండూరు, రెబ్బెన, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల వారికి అదనపు భారంగా మారాయి. ప్రతీరోజు వందలాది మంది మంచిర్యాల, గోదావరిఖని, కరీంనగర్ ప్రాంతాలకు బస్సుల్లో రాకపోకలు సాగించేవారికి ఈ చార్జీలు భారమని ప్రయాణికులు వాపోతున్నారు.

ఒక రోజు లక్ష్యం రూ.6.8లక్షలు

ప్రతీ రోజుకు ఈ టోల్‌గేట్ నుంచి రూ.6,86,999 వసూలు చేయాలనే లక్ష్యం ఉంది. ప్రస్తుతం రోజుకు రూ.4నుంచి రూ.5లక్షల మధ్య వసూళ్లు అవుతున్నాయి. ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ దక్కించుకున్న సంస్థ ఈ మేరకు వాహనాల నుంచి వసూలు చేస్తోంది. 'భారత్ మాల పరియోజన' కింద హామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడ్) పద్ధతిలో రూ.2,497కోట్లతో శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు సమీపం నుంచి కుమురం భీం జిల్లా వాంకిడి మండలం గోయగాం వరకు నాలుగు లైన్లతో 94కిలోమీటర్లు నిర్మిస్తున్నది తెలిసిందే. మొదటి సెక్షన్‌లో శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి రేపల్లెవాడ వరకు, అక్కడి నుంచి గోయగాం వరకు రెండో సెక్షన్. కోవిడ్‌తో నిర్మాణం రెండేళ్ల ఆలస్యమైంది. మొదటి సెక్షన్ గతేడు ఆగస్టు వరకు పూర్తి చేయాల్సి ఉన్నా, తాజా గడువు మార్చి వరకు ఉంది. ఇక రెండో సెక్షన్ కుమురంభీం జిల్లా పరిధిలో పనులు జరుగుతున్నాయి. ఇక్కడ టెండరు, భూ సేకరణలో జాప్యం జరిగింది. ఇటీవలే పనుల్లో వేగం పెరిగింది. మంచిర్యాల జిల్లా పరిధిలో 42కిలోమీటర్లలో 30కిలోమీటర్లు అందుబాటులోకి వచ్చిన రోడ్డు మేరకే ఈ చార్జీలు వసూలు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో అందుబాటులో వస్తే, మార్చి నుంచి టోల్ చార్జీలు మరింత పెరుగుతాయి. రెండో సెక్షన్‌లో వాంకిడి మండల పరిధిలో మరో టోల్‌ప్లాజా అందుబాటులోకి వస్తే ఆ ప్రాంత వాసులకు చార్జీలు పడనున్నాయి.

17ఏళ్లు కాంట్రాక్టర్ బాధ్యత

ఒప్పందం ప్రకారం కాంట్రాక్టరు రెండేళ్లలో రోడ్డు నిర్మించి, 15ఏళ్లపాటు నిర్వహణ బాధ్యత చూడాలి. మొత్తం 17ఏళ్లు ఉంటుంది. 'హామ్' పద్ధతిలో నిర్మిస్తునందున ఆ మేరకు టోల్ వసూలు చేస్తారు. మంచిర్యాల నుంచి రేపల్లెవాడ సెక్షన్ పరిధిలోనే రూ.17,33.45కోట్లు ఖర్చు చేశారు. ఈ వెచ్చించిన నిధులు వందశాతం వసూలు పూర్తయ్యాక, టోల్‌లో 40శాతం తగ్గుతుంది. ఆ తర్వాత నిరంతరం రోడ్డు నిర్వహణకు ఖర్చు చేస్తారు. అందుకు 20 ఏళ్ల వరకు పట్టే అవకాశం ఉంది.

స్థానికులకు ఉచితమివ్వాలి



టోల్ ప్లాజా సమీపంలోని 19కిలోమీటర్ల లోపు వారందరికీ ఉచిత పాస్‌లు ఇవ్వాలి. ఇంకా రోడ్డు నిర్మాణంలో ఉండగానే టోల్ వసూలు చేస్తున్నారు. ప్రతీరోజు ఈ రోడ్డు గుండా సమీప గ్రామాల పేద, మధ్య తరగతి ప్రజలు ప్రయాణం చేస్తున్నారు. వారిపై అదనపు భారం పడుతోంది.

– చేను రవి కుమార్, బెల్లంపల్లి బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ

పనులు పూర్తి కాకుండా వసూళ్లు ఏంటి?



మా దగ్గరి బంధువుకు ప్రమాదం జరిగి అత్యవసరంగా మంచిర్యాల ఆసుపత్రికి వాహనంలో తీసుకెళ్తే టోల్ వసూలు చేశారు. రోడ్డు పనులు పూర్తి కాకుండా ఈ వసూళ్లు ఏంటి? ఇదేంటని అడిగితే సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు.

– దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

నిబంధనల మేరకు చార్జీలు

హామ్ పద్ధతిలో అగ్రిమెంట్ చేసుకున్న ప్రకారమే టోల్ వసూలు చేస్తున్నాం. వాహనదారులు అందుబాటులోకి వచ్చిన రోడ్డు వరకే ఈ రుసుం చెల్లిస్తున్నారు. 20కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారికి, జిల్లా పరిధి వాహనాలకు చార్జీలో కొంత మినహాయింపులు ఉన్నాయి.

– రవీందర్‌రావు, పీడీ, ఎన్‌హెచ్ఏఐ

కలప దుంగలు ఎక్కడివి..?

- ఆదివాసీ రైతు ఇంటి ఆవరణలో పడేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- ఉద్దేశపూర్వకంగానే వేశారని ఆందోళన



కలప దుంగలతో రోడ్డుపై గుమిగూడిన ప్రజలు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం హట్టి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు భీంరావ్ అనే ఆదివాసీ రైతు ఇంటి ఆవరణలో కలప దుంగలు పడేయడం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. కలప దుంగలు పడేసిన వ్యక్తులు ఎవరో తేల్చాలని బుధవారం ఆదివాసీలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం జోడేఘాట్ వైపు నుంచి అక్రమంగా కలప తరలిస్తున్నారని సమాచారంతో హట్టి గ్రామం వద్ద తనిఖీలు చేపట్టిన అటవీశాఖ అధికారులు రూ.20వేల విలువ చేసే దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. వాహనాన్ని పట్టుకున్న స్థలానికి కేవలం 40 మీటర్ల దూరంలోనే భీంరావ్ ఇల్లు ఉంది. ఆ ఏడు కలప దుంగలను తాము పొలం పనులకు వెళ్లిన సమయంలో ఇంటి ఆవరణలో ఎవరో పడేశారని భీంరావ్ ఆరోపించాడు. ఈ విషయాన్ని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. అనంతరం పెసా మండలాధ్యక్షుడు మడావి భరత్‌తో పాటు పలువురు ఆదివాసీ నాయకులు దుంగలతో రోడ్డుపైకి వచ్చారు. ఎఫ్ఆర్వో మజారొద్దీన్, డీఆర్‌వోలు జ్ఞానేశ్వర్, సుజాత, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం ఘటనా స్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పినా ఆదివాసీలు ఒప్పుకోలేదు. అక్రమంగా కలప తరలిస్తూ పట్టుబడిన నిందితుడిని పిలిపించి అసలు దోషులు ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. గురువారం నిందితుడిని పిలిపించి చర్చిద్దామని అటవీశాఖ అధికారులు చెప్పడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

వేతన ఒప్పందంలో అన్యాయం

శ్రీరాంపూర్(మంచిర్యాల): 11వ వేతన ఒప్పందంలో కేవలం 19 శాతం పెంచడానికే ఒప్పందం చేసుకున్న జాతీయ సంఘాలు కార్మికులకు తీవ్ర అన్యాయం చేశాయని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవిందర్‌రెడ్డి, డెప్యూటీ జనరల్ సెక్రెటరీ చాట్ల అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. ఈ వేజ్‌బోర్డులో 50 శాతం వేతనాలు పెంచాలని డిమాండ్‌గా పెట్టామని, గతం కంటే ఎక్కువ శాతం వేతనాలు పెంచుకువస్తామని జాతీయ సంఘాల నేతలు కార్మికులను నమ్మించి ద్రోహం చేశారన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు తీరని నష్టం

శ్రీరాంపూర్(మంచిర్యాల): 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో జాతీయ సంఘాల నేతలు కాంట్రాక్టు కార్మికులకు అన్యాయం చేశారని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం ఆరోపించారు. బుధవారం శ్రీరాంపూర్‌లో కాంట్రాక్ట్ కార్మికులతో ఆయన మాట్లాడుతూ ఈ వేతన ఒప్పందంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఫస్ట్ కేటగిరీ వేతనాలు కల్పించేలా ఒప్పందం చేసుకురావాలని తాము డిమాండ్ చేసినా జాతీయ సంఘాలు పట్టించుకోలేదన్నారు. దీనిపై పలుమార్లు జాతీయ సంఘాలు, కోలిండియా యాజమాన్యాన్ని కలిసి విన్నవించామన్నారు. అయినా కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన డిమాండ్లపై ఇందులో చర్చించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, యాదగిరి, అప్పారావు, కిరణ్, కృష్ణ, ఈశ్వర్‌రావు, రాజయ్య, గౌరమ్మ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని ఆత్మహత్య


కోట హారిక (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండలో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన రచన, సత్తయ్య దంపతుల కుమార్తె కోట హారిక (19) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బాబాయ్ కోట స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డీజిల్ దొంగలపై కేసు నమోదు

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో డీజిల్ దొంగిలించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. లంక రవికుమార్‌తో పాటు, ప్రశాంత్, స్వామి, రాజేశ్, అర్జున్, అరవింద్, కొమురయ్య, వెంకటేశ్ డీజిల్ దొంగిలించి తరలిస్తుండగా పట్టుకున్నారు. గత నెల 31న 100 లీటర్ల డీజిల్ దొంగిలించే క్రమంలో గుర్తించినట్లు తెలిపారు. ఎస్టీపీపీలో ఎలక్ట్రీషియన్ హెల్పర్ రవికుమార్ తన బైక్‌పై ఎలక్ట్రికల్ స్క్రాప్ సామగ్రి తరలిస్తుండగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు.


ఇందన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద వైర్‌లెస్ సెట్‌తో సమాచారం ఇస్తున్న బీట్ అధికారి

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లో అధికారుల మధ్య సమన్వయంతో పాటు, సమాచారం వేగవంతానికి అటవీశాఖ మరో అడుగు ముందుకేసింది. ఫారెస్ట్ డివిజన్‌లో భద్రత మరింత కట్టుదిట్టం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొదటిసారిగా జన్నారం అటవీ డివిజన్‌లో 20 వైర్‌లెస్ సెంటర్ల ఏర్పాటుతో పాటు సిబ్బందికి 25 వాకీటాకీలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

వైర్‌లెస్ స్టేషన్లు.. వాకీటాకీలు

- కవ్వాల్ టైగర్‌జోన్‌లో అందుబాటులోకి..
- సమాచారం చేరవేత వేగవంతం
- అధికారులు, సిబ్బంది మధ్య పెరగనున్న సమన్వయం


వాకీటాకీ ద్వారా సమాచారం తెలుసుకుంటున్న బేస్‌క్యాంపు సిబ్బంది

సిబ్బందికి ధైర్యంగా ఉంటుంది



గతంలో వైర్‌లెస్ స్టేషన్లు ఉన్నా వాటిని వినియోగంలోకి తేలేదు. ప్రస్తుతం పాత వాటితో పాటు కొత్తవాటిని అందుబాటులోకి తెచ్చాం. వీటితో పాటు బేస్‌క్యాంపు సిబ్బందికి వాకీటాకీలు అందజేశాం. దీంతో బేస్‌క్యాంపు, పెట్రోలింగ్ చేసే సిబ్బందికి ధైర్యంగా ఉంటుంది. అత్యవసర సమయంలో ఇవి చాల ఉపయోగపడుతాయి.

– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

సమాచారం తెలుసుకోవడమే ముఖ్యం

జన్నారం అటవీ డివిజన్‌లోని అధికారుల మధ్య సమన్వయం చేసి సమాచారం సేకరణకోసం ఎఫ్‌డీవో మాధవరావు ఈ వ్యవస్థను ప్రారంభించారు. ఈ క్రమంలో డివిజన్ కేంద్రంలో కంట్రోల్ గదిని ఏర్పాటు చేసి సిబ్బంది ఒకరిని అందులో ప్రత్యేకంగా ఉంచారు. అతను ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 8 నుంచి 11 గంటల వరకు బీట్ అధికారులు, బేస్‌క్యాంపు సిబ్బంది నుంచి సమాచారం సేకరించి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తాడు. అత్యవసరమైన సమాచారం విషయంలో అందర్నీ అలర్ట్ చేస్తాడు.

బేస్‌క్యాంపు సిబ్బంది అలర్ట్

జన్నారం అటవీ డివిజన్‌లో బేస్‌క్యాంపు సిబ్బందిని అలర్ట్ చేయడమే కాకుండా సమాచారం వేగవంతం చేయడానికి ఈ వ్యవస్థను ముందుకు తీసుకువచ్చారు. రాత్రి వేళల్లో బేస్‌క్యాంపు సిబ్బంది సెల్‌ఫోన్‌కు సిగ్నల్ లేనిపక్షంలో వాకీటాకీల ద్వారా వైర్‌లెస్ స్టేషన్ల సమాచారం అందించేందుకు ఉపయోగపడనున్నాయి. అంతేకాకుండా అడవిలో పర్యటిస్తున్న సమయంలో సెల్‌ఫోన్‌కు సిగ్నల్ లేనిప్రదేశంలో సిబ్బందికి సమాచారం చేరవేయడంలో వాకీటాకీలు కీలకంగా పని చేస్తాయి. ఇందులో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లో పది బేస్‌క్యాంపులలో వైర్‌లెస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. దట్టమైన అడవుల్లో ఉంటూ కాపు కాసే సిబ్బందికి ఇవి ధైర్యాన్ని ఇస్తాయి. అడవులలో నిత్యం పర్యటించే సిబ్బంది వాకీ టాకీల ద్వారా, వైర్‌లెస్ స్టేషన్ల ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు అధికారులకు అందజేస్తారు.

డివిజన్‌లో 20 వైర్‌లెస్ స్టేషన్లు

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో అధికారులు, బేస్‌క్యాంపులకు కలిపి 20 వైర్‌లెస్ స్టేషన్లు ఉన్నాయి. డివిజన్‌లోని మూడు రేంజ్ అధికారుల వాహనాలతో పాటు మరో రెండు జీపులు, ఒక బులెరో వాహనానికి వైర్‌లెస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. పది బేస్‌క్యాంపుల్లో పది స్టేషన్లు, కంట్రోల్ గదిలో ఒకటి, ఎఫ్‌డీవో క్యాంపు కార్యాలయంలో ఒకటి, రెండు చెక్‌పోస్టులలో రెండు వైర్‌లెస్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు జన్నారం, ఇందన్‌పల్లి, తాళ్లపేట్ రేంజ్‌ల పరిధిలోని పలు బేస్‌క్యాంపు వాచర్లకు మొత్తం 25 వాకీటాకీలను అందజేశారు. బేస్‌క్యాంపు సిబ్బంది, రాత్రి పెట్రోలింగ్ చేసే సిబ్బంది వీటితో డివిజన్‌లోని సిబ్బందికి సమాచారం ఎప్పటికప్పుడు అందజేస్తారు. కంట్రోల్ గదిలో ఉండే సిబ్బంది ప్రతిరోజు బేస్‌క్యాంపులతో మాట్లాడి సమాచారం సేకరిస్తారు. వారు తిరిగిన ప్రదేశం, పరిశీలించిన అంశాలు, నేరుగా చూసిన వన్యప్రాణుల వివరాలు, సేకరించిన నమూనాలు, తదితర అంశాలను రోజువారీగా సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. దీన్ని బట్టి డివిజన్‌లో జరిగే ప్రతీ అంశం రిజిస్టర్ ద్వారా తెలిసిపోతుంది.

గాలిపటాల విక్రయ దుకాణాలు తనిఖీ


దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాలిపటాల విక్రయ దుకాణాల్లో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక సీఐ నారాయణ్ నాయక్ దాడులు నిర్వహించి కొన్నేండ్లుగా గాలిపటాలు విక్రయిస్తున్న గుండ శ్రీనివాస్, శ్రీధర్, నావెల్ కిషోర్‌శర్మలను తహసీల్దార్ రాజేశ్వర్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చైనా మాంజా ప్రాణాంతకమైందని, ఆకాశంలో విహరించే పక్షులకు ప్రాణహాని కలిగిస్తుందన్నారు. ఎవరైనా విక్రయించినా, ఉపయోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సైలు తైసినొద్దీన్, సుగుణాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా


జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

చెన్నూర్: చెన్నూర్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అదుపుతప్పి బొగ్గు లారీ బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో సమీపంలో ఎలాంటి వాహనాలు, పాదచారులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రోడ్డుపై బొగ్గు చూర పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జేసీబీ సాయంతో బొగ్గుచూరను తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు.

పోతురాజు, ధర్మరాజుకు ప్రత్యేక పూజలు

- నేటి నుంచి రెండు రోజులపాటు కార్యక్రమాలు
- తెలంగాణ, మహారాష్ట్ర నుంచి తరలిరానున్న భక్తులు


ఇందాపురంలోని పోతురాజు, ధర్మరాజు ఆలయం


ఆలయంలోని ప్రతిమలు

కెరమెరి(ఆసిఫాబాద్): కొలాం ఆదివాసీల కొంగుబంగారం.. మహిమాన్వితుడు, కోరిన కోర్కెలు తీర్చే దేవుడు పోతురాజు, ధర్మరాజు. మండలంలోని ఇందాపూర్ సమీపంలో ఉన్న ఆలయంలో కొలువుదీరిన పోతురాజు, ధర్మారాజుకు నేటినుంచి రెండు రోజుల పాటు సంప్రదాయబద్ధంగా పూజలు జరుపనున్నారు. జనవరిలో మొదటివారం వచ్చే గురువారం పోతురాజు ధర్మారాజు జన్మించిన రోజును పురస్కరించుకుని ఏటా పూజలు నిర్వహిస్తారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని నేటికీ పాటిస్తున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

గురువారం సాయంత్రం 6గంటలకు సింగర్‌వాడిలో పూజా కార్యక్రమం, పోతురాజు, ధర్మరాజుకు నైవేద్యం సమర్పించడం, రాత్రి 9:30 గంటలకు పెద్ద దేవునికి పూజా కార్యక్రమం, 6న తెల్లవారు జామున బోనం సమర్పణ, సాయంత్రం 4 గంటలకు కట్టు కట్టుకట్టడం, గుడిచుట్టూ ప్రదక్షిణలు చేయడం, మైసమ్మ, అమ్మవారి పూజ, లక్ష్మీపూజ, మొక్కుల చెల్లింపు, దేవుళ్లను గుడిలోకి సాగనంపడం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అటవీప్రాంతంలో గుప్తనిధుల తవ్వకాలు!

- అధికారులకు పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులు
- పోలీసులకు అప్పగింత

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని ఖర్జెల్లి రేంజ్ పరిధిలోని కోర్సిని, గంగాపూర్ అటవీప్రాంతంలో మంగళవారం రాత్రి అటవీబీట్ అధికారులు అనిల్, నవ్యశ్రీ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పడంతో లంబాడిహేటికి చెందిన అజ్మీర మంగిలాల్, లావుడె బాలు, సిర్పూర్(టి) మండలానికి చెందిన అశోక్ మండల్, కౌటాల మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన నరులె ప్రదీప్, చింతలమానెపల్లి మండలంలోని కోర్సినికి చెందిన దండికె మహేష్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రవీంద్రనగర్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఇన్‌చార్జి రేంజ్ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఐదుగురిని విచారించడంతో తాము కలపకోసం రాలేదని గుప్తనిధుల తవ్వకానికి వచ్చినట్లు వెల్లడించారు. గుప్తనిధుల తవ్వకం అటవీ శాఖ పరిధిలో లేక పోవడంతో ఐదుగురిని బుధవారం చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు అధికారి పూర్ణచందర్ తెలిపారు. ఐదుగురిని కుటుంబ సభ్యుల పూచీకత్తుతో విడుదల చేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి

మందమర్రిరూరల్ (చెన్నూర్): మందమర్రి మున్సిపాలిటి పరిధిలోని కేకే–5 ఏరియా ఫిల్టర్ బెడ్ ప్రాంతానికి చెందిన అన్విష్ (18 నెలలు) అనే చిన్నారి బుధవారం ఇంటివద్ద ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. చిన్నారి కేకలు విన్న తల్లిదండ్రులు పరిగెత్తుకుని వచ్చి కుక్కలను చెదరగొట్టారు. ఘటనలో చిన్నారి తల, ముఖంపై గాయాలయ్యాయి. ముందుగా పట్టణంలోని ఆస్పత్రితకి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నెల వ్యవధిలోనే సుమారు 15 మందిపై కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను అటవీ ప్రాంతానికి తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వేజ్‌బోర్డు సాధనలో బీఎంఎస్ పెద్దన్న పాత్ర


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): 11వ వేతన ఒప్పంద సాధనలో బీఎంఎస్ పెద్దన్న పాత్ర పోషించిందని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం ఎస్సార్పీ 1గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. తమ యూనియన్ జాతీయ నాయకుడు లక్ష్మారెడ్డి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి, కోలిండియా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడం వల్లే 19 శాతం వేతనాల పెంపునకు అంగీకరించిందన్నారు. వేజ్‌బోర్డు చర్చల్లో డీపీఈ గైడ్‌లైన్స్ అడ్డం పెట్టుకొని యాజమాన్యం వేతనాల పెంపు కేవలం 10 శాతంకు మించి చేయలేమని చేతులెత్తేసిన సందర్భంలో వారితో సుదీర్ఘంగా చర్చించి డీపీఈ గైడ్‌లైన్స్ ప్రస్తావన లేకుండానే నేడు ఒప్పందం చేయడం జరిగిందన్నారు. కార్మికుల హక్కులు, వేతనాల పెంపు, తదితర కీలక సమయాల్లో బీఎంఎస్ చురుకైన పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, ఉపాధ్యక్షులు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, గాజుల వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చిన నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని కోసిని గ్రామ పంచాయతీ పరిధిలోని పర్దాన్‌గూడ సమీపంలో అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చి ఒకరి మృతికి కారణమైన నలుగురిని బుధవారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 31న పర్దాన్‌గూడ సమీపంలో అమర్చిన విద్యుత్ తీగలను తాకి కోసిని గ్రామానికి చెందిన ఆదె విష్ణు మృతి చెందాడు. విచారణ చేపట్టిన పోలీసులు లెండుగురె హన్మంతు, ఆదె బాపురావు, సోనులె నగేశ్, కొట్రంగి బాపురావులను నిందితులుగా గుర్తించి వారి వద్దనుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఒక సైకిల్, బైండింగ్ వైరు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినా కొంతమంది తమ పద్ధతి మార్చుకోవడం లేదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

‘కాంట్రాక్టు కార్మికులకు తీరని ద్రోహం’


నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

బెల్లంపల్లి: జేబీసీసీఐ సమావేశాల్లో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించకుండా జాతీయ సంఘాలు ద్రోహం చేశాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి చాంద్‌పాషా, సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం బెల్లంపల్లి సివిక్ కార్యాలయం ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేజ్‌బోర్డు సమావేశాల్లో జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికుల ఏఒక్క అంశాన్ని కూడా చర్చించిన పాపాన పోలేదన్నారు. నమ్మిన జాతీయ సంఘాలు వారిని నయవంచనకు గురిచేశాయని మండిపడ్డారు. కాంట్రాక్టు కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేశాయని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు కార్మికులు పోరు బాట వీడొద్దని సూచించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ నాయకులు కృష్ణవేణి, వెంకటి, పద్మ, సునీత, లింగన్న, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

‘మహాసభ విజయవంతం చేయాలి’


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లు

పాత మంచిర్యాల: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈ నెల 11న నిర్వహించనున్న తెలంగాణ ప్రగతిశీల నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తోకల తిరుపతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రమాదబీమా కల్పించాలని, రోస్టర్ పద్ధతిన డ్యూటీలు వేయాలని, తదితర డిమాండ్లపై చర్చించనున్నట్లు తెలిపారు. నాన్‌టీచింగ్ వర్కర్లు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవళిక, శ్రీలత, స్వరూప, రాజేశ్వరి, బేగం, మనోజ, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మంచిర్యాలటౌన్: టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో లాజిస్టిక్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాల కార్గో కౌంటర్ నుంచి రైల్వేస్టేషన్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కరీంనగర్ జోన్ డెప్యూటీ సీటీఎం మధుసూదన్ మాట్లాడుతూ కార్గోపార్సిల్‌ను వ్యాపారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించాలి


ప్రదర్శన తిలకిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్


నృత్యం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలటౌన్: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి మ్యాథ్స్, సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 16 ఆశ్రమ పాఠశాలల నుంచి 100 ప్రాజెక్టులు రావడం అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థిలోనూ ఒక టాలెంట్ ఉంటుందని, దానిని బయటకు తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం, ఏటీడీవో చిరంజీవి, ఏసీఎంవో రాజమౌళి, స్పెషల్ ఆఫీసర్ శంకర్, ప్రోగ్రాం ఇన్‌చార్జి ఆర్.సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో మల్లారెడ్డి, వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి విద్యార్థిని బలవన్మరణం

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి విద్యార్థిని బలవన్మరణం చెందిన ఘటన ఆసిఫాబాద్ మండలంలో చోటు చేసుకుంది. విద్యార్థిని కుటుంబ సభ్యులు, ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని అంకుసాపూర్ గ్రామానికి చెందిన వాణిశ్రీ (18) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. బుధవారం కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత సాయంత్రం తల్లికి పురుగుల మందు తాగినట్లు చెప్పింది. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి తండ్రి దత్తు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

చెన్నూర్: పట్టణంలోని మైనార్టీ బాలుర పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అమనోద్దీన్‌ను ఉపాధ్యాయుడు జగన్ చితకబాదిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తల్లి సలేహా సుల్తానా తెలిపిన వివరాల ప్రకారం 25 రోజుల క్రితం అమనోద్దీన్ ప్రార్థన కోసం వెళ్లిరాగా ఆలస్యంగా వచ్చావంటూ ఉపాధ్యాయుడు జగన్ చితకబాదడంతో రక్తస్రావం అయ్యింది. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వచ్చిన సదరు విద్యార్థి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో సదరు ఉపాధ్యాయుడిపై ఆర్సీవోకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొంది. అంతేకాకుండా బుధవారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయున్ని నిలదీయడంతో పాటు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పునరావృతం కాకుండా చూస్తాం

నూతనంగా బాధ్యతలు చేపట్టా. ఈ సంఘటనపై విద్యార్థి నాదృష్టికి తీసుకురాలేదు. విద్యార్థి తల్లి బుధవారం నా దృష్టికి తీసుకువచ్చింది. ఉపాధ్యాయున్ని పిలిపించి అడగడం జరిగింది. ఈలాంటి ఘటన రానున్న రోజుల్లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, ప్రిన్సిపాల్